17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,14 ఫిబ్రవరి 2024

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ నిమిత్తం రాష్ట్ర వాటా నిధులు మంజూరు

- ఎంపి చింతా అనురాధ

అల్లవరం, మేజర్ న్యూస్ : కోటిపల్లి – నరసాపురం రైల్వే లైన్ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా భూసేకరణ కొరకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 50 కోట్ల నిధులను మంజూరు చేశారని ఎంపీ చింతా అనురాధ తెలిపారు. రైల్వే లైన్ నిర్మాణం కోసం రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. వైయస్సార్సీపి ప్రభుత్వ పాలనలో రైల్వే ప్రాజెక్ట్ ముందడుగు వేసిందని ఎంపీ అన్నారు. గత ప్రభుత్వాలు జీవోలకే పరిమితమై కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో రైల్వే ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ప్రాజెక్ట్ నత్తనడకన సాగిందన్నారు. భూసేకరణ కొరకు రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేసిన 50 కోట్లతో రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేవని, ఇక నుండి ప్రాజెక్ట్ పరుగులు తీస్తుందని ఎంపీ అనురాధ హర్షం వ్యక్తం చేశారు. కోటిపల్లి – నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.1409 కోట్లు సాధించిన ఘనత వైయస్ఆర్సీపీ ప్రభుత్వానిదని ఎంపీ అనురాధ అన్నారు. ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో కోటిపల్లి – నరసాపురం రైల్వే లైన్‌కు రూ.300 కోట్లు, కాకినాడ నుండి కోటిపల్లి వరకు రైల్వే ట్రాక్ మరమ్మతులకు రూ.10 కోట్లు, అమలాపురం రూరల్ బట్నవిల్లి నుండి చించినాడ వరకు భూసేకరణ నిమిత్తం సీఎం జగన్మోహన్ రెడ్డి రూ.50 కోట్లు కేటాయించడం హర్షణీయమని ఎంపీ చింతా అనురాధ అన్నారు.

పట్టా కాగితాలు ఇచ్చారు... స్థలాలు ఇవ్వలేదు

- లేని స్థలాలకు కాగితాలపై రిజిస్ట్రేషన్‌లు

కాకినాడ, మేజర్ న్యూస్ : నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు పథకంలో పంపిణీ చేసిన ఇళ్ళ పట్టాలకు స్థలాలు చూపించి రిజిస్ట్రేషన్ల చేయాలంటూ లబ్దిదారులు ఆందోళన బాట పట్టారు. కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలం వి.కె.రాయపురం గ్రామానికి చెందిన నిరుపేదలకు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో అప్పటీలో దవులూరి దొరబాబు నేతృత్వంలో ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. భారీ సమావేశంలో పెట్టి లబ్ధిదారులను తీసుకువచ్చి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేయించారు. వారి చేతికి పట్టా కాగితాలు ఇచ్చారు. అది చూసి తమకు సొంత ఇల్లు వచ్చాయని పాపం లబ్ధిదారులు మురిసిపోయారు. అయితే అధికారులు ఇంతవరకూ వారికి స్థలాలు చూపించలేదు. వారి వద్ద ఉన్నవి కేవలం పట్టా కాగితాలు మాత్రమే. వాసవానికి 2020 డిసెంబరు 25వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. పెద్దాపురం నియోజవర్గంలో దశల భారీగా ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. సామర్లకోటలో పూర్తయిన ఇళ్లను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులంతా కూడా తమకి ఇలాంటి ఇళ్లు వస్తాయి అని ఆశపడ్డారు. కానీ ఇప్పటివరకు పట్టా కాగితాలు ఇచ్చినవారిలో మూడొంతులు మందికి స్థలాలు చూపలేదు. అధికారులు ఇదిగో అంటున్నారు. ఏదైతే ఇళ్ల స్థలాలు కేటాయించారో ఆ స్థలాలు ఇప్పటికీ చదును చేయలేదు. కొన్ని లోతట్టు ప్రాంతాలుగా ఉన్నాయి. మరి కొన్నిచోట్ల మోకాలి లోతు తుప్పలతో నిండిపోయి ఉన్నాయి. ఎన్నికల సమయం దగ్గరకు వస్తోంది. ఈ నేపద్యంలో ప్రజల ఆదరణ చూరగొని మరోసారి ఓటు వేయించుకునేందుకు ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు తెర తీసింది. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టింది. సచివాలయాలలో పంచాయితీ కార్యదర్శులకు జాయింట్ సబ్ రిజిస్టర్ హోదా ఇచ్చి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. చాలా పంచాయితీలలో ఇలా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిపోయింది. స్థలాలు చూపలేదు. కేవలం కాగితాల మీద రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. ఇళ్ళ పట్టాలు అందుకున్న వారందరికీ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. స్టలాలు చూపించి రిజిస్ట్రేషన్లు చేయాలంటూ లబ్దిదారులు సామర్లకోట–కాకినాడ వెళ్ళే ప్రదాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్దిదారులు పాల్గొన్నారు.

దీంతో కాకినాడ – సామర్లకోట రోడ్డు మార్గంలో భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపుగా 400 మంది బాధితులకు ఇప్పటివరకు స్థలాలు చూపలేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఇళ్లస్థలాలు పంపిణీ చేసిన సమయంలో పనిచేసిన విఆర్వో సాయి పత్తా లేకుండాపోయారు. ఆయన కొంతమేర గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు చేస్తున్నారు మహిళలు. అదేవిధంగా హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుదీర్ఘకాలం పనిచేసి, పెద్దాపురం ఇన్చార్జిగా వైసీపీకి పనిచేస్తూ ముఖ్యమంత్రి జగన్‌తో పెద్దాపురం అభ్యర్థి అని ప్రకటింపచేసుకున్న దవులూరి దొరబాబు పెదవి విప్పడం లేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఇటీవల స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు లేవు. దీంతో రోడ్ ఎక్కారు. రాస్తారోకోకు దిగారు. ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. తమకు న్యాయం చేసే వరకు కదిలేది లేదంటున్నారు. వీఆర్వో సాయితోపాటు కొందరు మునిసిపల్, రెవిన్యూ అధికారులపై కూడా చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికైనా దవులూరి దొరబాబు స్పందించి వారికి స్థలాలు స్వాధీనం చేయకపోతే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమని మహిళా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ప్రతిపక్షాలకు మంచి ఆయుధం దొరికింది. ప్రతిపక్ష నేతలు సైతం ఆందోళనకు సై అంటున్నారు.

ఎన్నికలకు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

రంపచోడవరం, మేజర్ న్యూస్ : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ప్రకారం అందరూ పనిచేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ అన్నారు. పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలని సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ సెక్టార్ అధికారులు, తాహసిల్దార్లును ఆదేశించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయాలు ఏర్పాట్లుపై సెక్టార్ అధికారులు, తాహసిల్దార్లు, డిప్యూటీ తాహసిల్దార్లులతో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. అలాగే చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం, చిత్తూరు డివిజన్లు పరిధిలోని 11 మండలాల్లో రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని 399 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ బూత్‌ల్లో నిబంధనలు ప్రకారం మౌలిక సదుపాయాలు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ బూత్‌లలో మరమ్మత్తులు చేయించి ఫోటోలు తీసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 59 మంది సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు.

అదేవిధంగా సెక్టార్ అధికారులు అందరూ వారికి కేటాయించిన రూట్లలో ఏ వాహనాలు కావాలో, ఎన్ని వాహనాలు కావాలో నివేదికలు సమర్పించాలన్నారు. అదేవిధంగా సెక్టార్ అధికారులు అందరూ ఆయా రూట్లకు సంబంధించి రెండేసి రూట్ మ్యాప్‌లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు ఎన్నికలు జరిగే వరకు వారికి కేటాయించిన రూట్లలో పర్యటించి పరిశీలన జరపాలన్నారు. సెక్టార్ అధికారులకు ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ పౌరుడు వారికి నచ్చిన విధంగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వికలాంగులకు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల కమిషన్ నిబంధనలు ప్రకారం వెసులుబాటు కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో తాసిల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, చలపతిరావు, రమణారావు, సత్యనారాయణ, నాగమణి, డిప్యూటీ తాహసిల్దార్లు యన్.వి.వి. సత్యనారాయణ, బి.రాజు, సుబ్బారావు, శ్రీధర్, శివ, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, ఇందిరా బాయి, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మీసాల వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పులిదిండి గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మీసాల వేణుగోపాలస్వామి ఆలయాన్ని పునర్నిర్మాణం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ధూప దీప నైవేద్యాలు నోచుకోని ఆలయాల పునరుద్ధరణ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల రూపాయలు మంజూరు చేయగా గ్రామస్తులు సమకూర్చిన 35 లక్షల రూపాయలు విరాళాలతో ఆలయాన్ని సుందరంగా పునర్నిర్మానం చేశారు. విశిష్ట ప్రసిద్ధి చెందిన మీసాల వేణుగోపాలస్వామి ఆలయంలో సినీహీరో సూపర్ స్టార్ కృష్ణ, కథానాయికి విజయనిర్మల వివాహం హాస్యనటుడు రాజబాబు జరిపించారని స్థానికులు తెలిపారు. 1965వ సంవత్సరంలో పులిదిండి గ్రామంలో సాక్షి సినిమా షూటింగ్ చేస్తున్న సమయంలో సూపర్ స్టార్ కృష్ణ విజయనిర్మల మధ్య ప్రేమ చిగరించింది. ఆ సమయంలో ఇరువురి అంగీకారంతో రాజబాబు పెండ్లి పెద్దగా వ్యవహరించి ఇరువురికి వివాహం జరిపించారని స్థానికులు తెలిపారు. దీంతోపాటు గ్రామంలో చింతాలమ్మ తల్లి ఆలయ నిర్మాణం చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ కనుమూరి సూర్య సీతాకుమారి నరసింహారాజు తెలిపారు. ఆత్రేయపురంలో సాగిరాజు తేజ వర్మ స్వామివారి క్యాలెండర్లు, ఫోటోలు పంపిణీ చేశారు.

16వ తేదీ దేశవ్యాప్త బంద్ గోడపత్రిక ఆవిష్కరణ

కాకినాడ,మేజర్న్యూస్ : రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్టం, ఇన్సూరెన్స్ సౌకర్యం భూయజమానితో సంబంధం లేకుండా కల్పించాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల మెడపై పెట్టిన కత్తి హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుతూ ఫిబ్రవరి 16వ తారీఖున గ్రామీణ బంద్, ట్రాన్స్ పోర్ట్ సమ్మె, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో గోడ పత్రికను అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టీయూసీ ఏపీ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగుల ఈశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు గడిగట్ల సత్తిబాబు, కరణం విశ్వనాథం, కాటం రాజు, టి.రాజా, దివిలి నాగు తదితరులు పాల్గొన్నారు.

JEE MAIN - 2024(JAN)లో 'ఆదిత్య' చారిత్రాత్మక విజయం

- 99.00 పర్సంటైల్ పైన సాధించిన 62 మంది విద్యార్థులు

కాకినాడ, మేజర్ న్యూస్ : JEE MAIN - 2024(JAN) ఫలితాలలో ఆలిండియా బెస్ట్ పర్సంటైల్‌లతో ఆదిత్య జాతీయస్థాయి ఫలితాలలో సుస్థిర స్థానాన్ని కొనసాగిస్తోంది. ఛైర్మెన్ ఎన్. శేషారెడ్డి మాట్లాడుతూ ఈ విజయం మా పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్‌కి నిలువుటద్దం వంటిది అన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

సెక్రెటరీ ఎన్. కృష్ణ దీపక్ రెడ్డి మాట్లాడుతూ బి.రఘురామ సహన్ 99.95, జి.జగదీష్ వెంకట సీతారామ్ 99.95, ఎ.హెచ్. సత్య నిహంత్ 99.94, ఎ.చరణ్ ఉమేష్ 99.94, పర్సంటైల్‌ను సాధించారని మరియు 62 మంది విద్యార్థులు 99.00 పర్సంటైల్ పైన సాధించి, JEE MAIN - 2024(JAN)లో అత్యుత్తమ ప్రతిభను కనపర్చారు అని తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జీజుజు (హీూ×చీ) లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, అందుకు కృషిచేసిన అధ్యాపకులను అభినందించారు. మా మీద విశ్వాసంతో తమ పిల్లలను మావద్ద చేర్పించిన తల్లిదండ్రుల ఆశలు సఫలీకృతం చేయగలిగామని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల హాస్టల్ డైరక్టర్ ఎన్. లక్ష్మీరాజ్యం, ఆదిత్య విద్యాసంస్థల డైరక్టర్ ఎన్. శృతి, డైరక్టర్ ఎన్. సుగుణ, కోఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్, అకడమిక్ డైరక్టర్ ఎస్.వి. రాఘవరెడ్డి, ఎస్. పి. గంగిరెడ్డి, ప్రిన్సిపాల్స్ జె.మెయిన, పి.సత్యనారాయణ రెడ్డి, ఐఐటి క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్. ఫణీంద్ర మరియు ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాలలో గల కళాశాలల ప్రిన్సిపాల్స్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఉత్తమ శిక్షణనందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.

సముద్ర తాబేళ్ల రక్షణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా

కాకినాడ, మేజర్ న్యూస్ : సముద్రంలో పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో సముద్ర తాబేళ్లు (ఆలివ్ రిడ్లీ) కీలక పాత్ర పోషిస్తాయని సముద్ర తాబేళ్ల ఆవశ్యకతను గుర్తించి వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు.

ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణ, హోప్ ఐలాండ్ పరిసర ప్రాంతాల్లో వేట నిషేధ అమలు, మత్స్య కారులకు అవగాహన సదస్సులు నిర్వహణ వంటి అంశాలపై మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి, కాకినాడ సీ పోర్ట్, మత్స్య, కస్టమ్స్, మెరైన్ తదితర శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సముద్ర తాబేళ్ల సంరక్షణకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సముద్రంలో పర్యావరణ సమతుల్యతను నెలకొల్పడంలో ఆలీవ్ రిడ్లీ తాబేళ్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇవి డిసెంబర్ నుండి తమ సంతానోత్పత్తి ప్రదేశాలకు రావడం ప్రారంభిస్తాయని.. సంతానోత్పత్తి కాలం జనవరి నుండి మార్చి వరకు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లాలో ఆలీవ్ రిడ్లీ తాబేలుకు హోప్ ఐలాండ్ మాత్రమే సంతానోత్పత్తి ప్రదేశం/గూడు కట్టే ప్రదేశమని కలెక్టర్ తెలిపారు. చేపలు పట్టే వలలు, ప్రమాదవశాత్తూ తాబేళ్లు పట్టుకోవడం, మెకనైజ్డ్ బోట్లలో ప్రొపెల్లర్ల కారణంగా తీవ్రంగా గాయపడడం, గూడు కట్టే సమయంలో ట్రాలర్‌లను ఉపయోగించడం, హోప్ ఐలాండ్‌లో రాత్రిపూట వలలు బిగించడం వంటి ప్రధాన కారణాల వలన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు తరుచుగా మరణిస్తున్నాయని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం ఆలివ్ రిడ్లీ తాబేళ్లు గుడ్లు పొదిగే సమయం కావడంతో హోప్ ఐలాండ్ పరిసర ప్రాంతాల్లో ఏప్రిల్ 30 వరకు వేట నిషేధించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. హోప్ ఐలాండ్ పరిసర ప్రాంతాల్లో మెకనైజ్డ్ ట్రాలర్ల నిర్వహణ నిషేధంపై మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించి, విస్తృత అవగాహన కల్పించాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు. సముద్ర తాబేళ్లు గూడు కట్టుకునే ప్రదేశం (హోప్ ఐలాండ్) చుట్టూ 12 కిలోమీటర్ల వరకు చేపల వేటాడటం, ఓడలు లంగరు వేయడం, నౌకల కదలికలను నిషేధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ చట్టం–1995 ప్రకారం కఠినంగా శిక్షించడం జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్–ఎస్ఆర్ వరప్రసాద్,ఇన్చార్జి జిల్లా మత్స్య శాఖ అధికారి కే.కరుణాకర్ రావు, పోర్ట్ ఆఫీసర్ కస్టమ్స్ సూపరింటెండెంట్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగలకుర్రు గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం

అంబాజీపేట, మేజర్ న్యూస్ : యూనిట్ ఇన్‌చార్జ్ దూనబోయిన బాబి ఆధ్వర్యంలో బాబు షూరిటీ– భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్–8 ఇన్ చార్జ్ నాగాబత్తుల వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. 134, 135 కన్వీనర్స్, కాగితపల్లి సాయిరాం, జొన్నాడ విజయ్ కుమార్, పరిధిలో బాబు షూరిటీ– భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ బాబు షూరిటీ– భవిష్యత్తు గ్యారంటీ పత్రాలను అందచేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి, గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు యర్రం శెట్టి వీరభద్రరావు, కమిడి వీర వెంకట సత్యనారాయణ, అధికారపు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

- నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు

- కాకినాడలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, బిజెపి నేతలు

కాకినాడ, మేజర్ న్యూస్ : పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు పేర్కొన్నారు. స్థానిక ప్రతాప్ నగర్ వాటర్ ట్యాంక్, కొండయ్య పాలెం నూకాలమ్మ ఆలయం ప్రాంతాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కోసం స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. అభివృద్ధికి పునరంకితమవుతామని అక్కడకు వచ్చిన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర పథకాల క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమంతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని, అందువల్లే కేంద్ర ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. వీటిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. ఆయా ప్రాంతాలలో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోమెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, బిజెపి రాష్ట్ర మేధావుల విభాగం కన్వీనర్ ముత్తా నవీన్, బిజెపి నాయకులు వేటుకూరి సూర్య నారాయణ రాజు, గట్టి సత్యనారాయణ, రంబాల వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అదృశ్యం అయిన ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యం

అల్లవరం, మేజర్ న్యూస్ : ఈ నెల 12వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో అల్లవరం మండలం గోడి గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మెల్లం నాగేంద్రబాబు, గుర్రాల టోనీ బాబు పాఠశాల నుండి కనిపించ కుండా వెళ్ళిపోయారు. ఈ విషయమై గురుకుల పాఠశాల హాస్టల్ ప్రిన్సిపాల్ నక్క శ్రీనివాస్ అల్లవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా సదరు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినారు. అమలాపురం డిఎస్పీ పర్యవేక్షణలో అమలాపురం రూరల్ సిఐ వీరబాబు ఆధ్వర్యంలో దర్యాప్తులో భాగంగా కాకినాడ బస్టాండ్‌లో ఉన్నట్లు సమాచారం రాగా అక్కడికి వెళ్లి వారిని సురక్షితంగా అల్లవరం పోలీస్ స్టేషన్ తీసుకుని వచ్చి వారి యొక్క తల్లిదండ్రులకు మరియు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ని పిలిపించి వారికి అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో తప్పిపోయిన ఇద్దరు బాలురు ఆచూకీ గురించి తెలుసుకొని కేసు చేదించిన అమలాపురం రూరల్ సి.ఐ వీరబాబు మరియు అల్లవరం పోలీసులను జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ అభినందించారు.

సీఈవో రామచంద్రమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపిడివో కృష్ణమోహన్

అల్లవరం, మేజర్ న్యూస్ : ఇటీవల జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రమూర్తిని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంపిడిఓ ల సంఘం అధ్యక్షుడు అల్లవరం ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఇదే రోజు ఉదయానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 62 మండలాలలో 15 వ ఆర్థిక సంఘం నిధులు నూటికి నూరు శాతం వినియోగించిన ఏకైక మండలంగా అల్లవరం నిలవడం పట్ల సిఈఓ, అల్లవరం ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ ను అభినందించి ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

16న ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మె జయప్రదం చేయండి

పెద్దాపురం, మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టం తీసుకురావడానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 16వ తేదిన దేశవ్యాప్తంగా జరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జి పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దాపురం లారీ యూనియన్ కార్యాలయంలో డ్రైవర్లతో సమావేశం సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శేషుబాబ్జి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి, డ్రైవర్ల మెడకు ఉరితాడుగా హిట్ & రన్ చట్టం చేసిందని, డ్రైవర్లకు రూ.10లక్షలు పెనాల్టి, 10 సం.ల జైలుశిక్ష విధించే పని చేసిందని, ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని తక్షణం హిట్ & రన్ చట్టం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ నాయకులు, గూడ్స్ వ్యాన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలి
- ఆర్వో, ఈఆర్వో, నోడల్ అధికారులకు దిశ నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

సాధారణ ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలి

కాకినాడ,మేజర్ న్యూస్ : రాబోయే సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్, కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం ఆర్వో డా.కృతికా శుక్లా ఎన్నికల అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా..జాయింట్ కలెక్టర్ సీ.వీ. ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఎన్నికల ఆర్వోలు, ఈఆర్ఓలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు క్షుణ్ణంగా చదవి అవగాహన చేసుకుని, విశ్వాసం పెంపొందించుకొని అందరూ ఖచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన విధులను సజావుగా నిర్వర్తించాలన్నారు. ఇందుకోసం కావలసిన పరికరాలు సామాగ్రిని సమకూర్చుకోవాలన్నారు. ఇలాంటి సమావేశాలు మరికొన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారికి వివిధ అంశాల్లో సహకారం అందించడానికి 19 మంది సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని ఆమె తెలిపారు. ఎన్నికలకు సంబంధించి 2023 సంవత్సరంలో భారత ఎన్నికల సంఘం జారీచేసిన మాన్యువల్ పుస్తకాలను, సూచనలను, మార్గదర్శకాలను యధాతధంగా తప్పకుండా అనుసరించాలన్నారు.ప్రతిరోజు భారత ఎన్నికల సంఘం తాజాగా అనేక సంస్కరణలు, సూచనలు జారీ చేస్తుందని వాటిని దృష్టిలో పెట్టుకొని అమలు చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం పనికి రాదని స్పష్టం చేస్తూ భారత ఎన్నికల సంఘం జారీ చేసిన సూచనలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చదువుకోవాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్లోని ఎన్నికల విభాగంతో సంప్రదించాల న్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టా లని ఆమె అధికారులకు స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలను ఓటరు తెలుసుకునే కార్యక్రమాన్ని బీఎల్వోలు పక్కాగా చేపట్టి ప్రతిఒక్కరూ ఓటువేసేలా ప్రోత్సహించాలన్నారు. ఎన్నికల సమయంలో శాంతి భద్ర తలకు ఎలాంటి విఘాతం కలగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పా టు కోసం ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన సమయం నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి(ఎంసీసీ) అమల్లోకి వస్తుందన్నారు. దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ప్రత్యేకించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వారి ఇంటి వద్దనే కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమ రాలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి మొదలుకొని బూత్ స్థాయి అధికారులు, పోలింగ్ కేంద్రాల వారీగా నియమించబడిన అధికారులు, సిబ్బంది ఫోన్ నెంబర్లతో ఒక డైరెక్టరీని సిద్ధం చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సీ విజిల్ యాప్ ద్వారా 24 గంటల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలలో సజావుగా జరిగేందుకు సాధారణ, పోలీ సు, వ్యయ పరిశీలకులు జిల్లాకు వచ్చినప్పుడు వారికి కావలసిన సదుపాయాలు పర్యటన ప్రణాళిక తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులకు సరైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కాకినాడలోని జేఎన్టీయూలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆమె తెలిపారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు హాళ్లు ఆర్వో లు పరిశీలించుకోవా లన్నారు.సమావేశంలోజిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జే.వెంకట్రావు, సీపీవో పీ.త్రీనాథ్, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడి ఎ.వెంకటలక్ష్మి, జిల్లా పౌర సంబంధాల అధి, కారి డి.నాగార్జున,పలువురుఏఆర్వోలు,ఏఈఆర్వోలు,అధికారులు పాల్గొన్నారు.

మొబైల్ సేవలలో అగ్రగామి ఎయిర్‌టెల్

- జోనల్ బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక దేవాలయం వీధిలో నూతనంగా ప్రారంభించిన ఎయిర్‌టెల్ షోరూమ్‌ను ఎయిర్‌టెల్ జోనల్ బ్రాంచ్ మేనేజర్ టి.రామకృష్ణ మంగళవారం సందర్శించారు. ఆయనకు షోరూమ్ అధినేత రొటేరియన్ సత్తి రవిరెడ్డి పర్యావరణ పరిరక్షణ కల్పించే ప్రత్యేక బొకేను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మొబైల్ సేవల రంగంలో అగ్రగామిగా ఎయిర్‌టెల్ ఉందని, వినియోగదారులకు సకాలంలో సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నామని అన్నారు. కంపెని అందజేసే రాయితీలతో పాటు నూతన మోడల్ సెల్‌ఫోన్లు పట్ల వినియోగదారులకు అవగాహన కల్పించే విధంగా షోరూమ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సిందిగా సూచించారు. సేవారంగంలో మంచి పేరున్న సత్తి రవిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, వ్యాపార రంగంలోను మంచి అభివృద్ధి సాధించి సంస్థ మరింతగా విస్తరించడానికి సహకరించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జోనల్ సేల్స్ మేనేజర్ మేకల నరసింహ, టి.ఎస్.ఎం. గుమ్మడి అప్పారావుతో పాటు పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

సత్యదేవా అంతరాలయం దర్శనం టికెట్‌కి ప్రసాదం ఎక్కడ ?

అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారా యణ స్వామివారి దేవస్థానంకి సుదూర తీర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వచ్చి స్వామివారి వ్రతం ఆచరించి స్వామివారి దర్శనం చేసుకుని ఎంతో ముక్తిని పొందుతారు. ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా అన్నవరంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంకి కొత్తగా పెళ్లయిన దంపతులు, ఏదైనా మంచి జరిగితే స్వామివారి సన్నిధికి వచ్చి మొక్కు తీర్చుకోవడం ఎప్పటినుంచో ఉన్న ఆనవాయితి. అయితే ఇక్కడ స్వామివారి అంతరాలయ దర్శనానికి 300 రూపాయలు టికెట్ పెట్టి ఒక ప్రసాదం ప్యాకెట్ దేవస్థానం వారు ఇస్తున్నారు. అయితే కొంతమంది భక్తులకు ఆ టికెట్ పట్టుకుని ప్రసాదానికి ఎక్కడికి వెళ్లాలో తెలియక చాలా అవస్తులు పడుతున్నారు. దేవస్థానం అధికారులు భక్తులు ఇబ్బంది గమనించి 300 రూపాయల టికెట్ తీసుకున్న భక్తులకు దర్శనం అనంతరం అక్కడే ప్రసాదం ఇస్తే బాగుంటుందని భక్తులు అంటున్నారు. అయితే ఈ టికెట్ కి సంబంధించిన ప్రసాదం ఎవరికి చెందుతుందో అని కొందరు భక్తులు అంటున్నారు. మొత్తానికి సత్యదేవుని అంతరాలయ దర్శనం ప్రసాదం ఎవరికి చెందుతుందో దేవస్థానం అధికారులకు తెలుసో లేదో అంటూ భక్తులు చర్చించుకుంటున్నారు.

చుక్కలు చూపిస్తున్న జెసి

- ఖంగు తింటున్న ప్రజప్రతినిధులు

కాకినాడ, మేజర్ న్యూస్ : సాధారణంగా అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అందరూ కూడా ఎన్నికల ముందు తమ మాట వినే అధికారులు ఉండాలని కోరుకుంటారు. అందుకే ఎన్నికల సమయంలో భారీగా బదిలీలు ఉంటాయి. ఎన్నికలు కీలకం కాబట్టి ఖచ్చితంగా అధికారులు తాము చెప్పిన పనులు చేయాలి. మరోసారి తాము గెలవాలి కాబట్టి ఈ వెసులుబాటు కలిగించాలని అధికారుల బదిలీల్లో తమ అనుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ గా పనిచేస్తున్న ఇలాక్కియాను బదిలీ చూసి ఆమె స్థానంలో ప్రవీణ్ ఆదిత్య ను నియమించారు. ఆయన నిజాయితీగా, ముక్కుసూటిగా వ్యవహరించే అధికారిగా గతంలోనే పేరు పొందారు.ప్రస్తుతం ఆయన అధికారులకు, ప్రజాప్రతినిధులకు చుక్కలు చూపిస్తున్నారు. నూటికి నూరు శాతం నిబంధనల ప్రకారం వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. అధికార పార్టీకి చెందిన కేడర్‌కు ఎమ్మెల్యేలు లేదా ఆయా నియోజకవర్గాల ఇంఛార్జీలు ఆఫ్‌లైన్‌లో ఇళ్లస్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం కొన్ని స్థలాలు కూడా ఖాళీగా ఉంచారు. వీటిని ఆన్‌లైన్‌లో కాకుండా పొజిషన్ పట్టాల రూపంలో ఇచ్చేందుకు నిర్ణయించారు. కరెక్ట్‌గా ఇక్కడే జెసి ప్రవీణ్ ఆదిత్య ఇళ్లస్థలాల పంపిణీపై పూర్తిస్థాయిలో దృష్టి సాదించారు. ఎక్కడైతే ఇళ్ల స్థలాలు ఉన్నాయో, పంపిణీ చేశారో వాటిని డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించారు. అనంతరం ఆ ఇళ్లస్థలాల ప్లాన్లు తీసుకువచ్చి ఎవరికీ ఏ స్థలాలు ఇచ్చారు. ఇంకా ఎన్ని ఖాళీలు ఉన్నాయి తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఇవన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తద్వారా అవి ఆన్‌లైన్‌లోకి వెళితే ఆఫ్‌లైన్ ద్వారా పట్టాలు ఇవ్వడానికి ఉండదు. కొన్నిచోట్ల ఖాళీ స్థలాలను ఆఫ్‌లైన్‌లో ఇచ్చే ఏర్పాటు కూడా ఎమ్మెల్యేలు చేసుకున్నారు. వాటిని కూడా కచ్చితంగా డ్రోన్ సర్వే చేయించాలని జెసి ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల గొంతులో పచ్చివేలక్కాయ పడినట్లు అయింది. మొత్తం స్థలాలు ఆన్‌లైన్ అవుతున్నాయి. దీంతో ఎమ్మెల్యేలు లేదా ఇంఛార్జిలకు ఎలాంటి ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు పాత తాసిల్దార్ లు బదిలీ అయ్యారు, కొత్తవారు వచ్చారు. పాత తేదీలతో సంతకాలు పెట్టే అవకాశం లేకుండా పోయింది. దీంతో వారంతా ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై రెవెన్యూ మంత్రి, ముఖ్యమంత్రితో మాట్లాడుతామని ఓ ఎమ్మెల్యే వెల్లడించారు. ఎన్నికల ముందు ఇలా అధికారులు వ్యవహరిస్తే దెబ్బతినే పరిస్థితి ఉంటుందని అధికార పార్టీ నాయకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో జెసి ని బదిలీ చేయిస్తారా లేక తమ మాట వినే విధంగా పైనుంచి చెప్పిస్తారా అంటూ కేడర్ చర్చించుకుంటున్నారు. మొత్తం మీద వైసిపి కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తామందరికీ విలువైన స్థలాలు వస్తాయని ఇన్నాళ్లు ఎదురుచూసారు. తీరా జెసి ప్రవీణ్ ఆదిత్య తీసుకున్న నిర్ణయంతో ఎవరికీ ఒక పట్టా కూడా ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలంతా కూడా సీరియస్‌గా తీసుకుంటున్నారు.

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో కనీస మౌలిక వసతులు

- ఈఆర్వో జే.వెంకటరావు ఆదేశం

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రతి పోలింగ్ బూత్‌లోనూ ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆయన రేచర్లపేట, రామకృష్ణారావుపేట, రామారావుపేట తదితర ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఆయా పీఎస్ లలో కనీస మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్, రాంపులు, ఇతర సౌకర్యాలు విధిగా ఉండాలని ఈఆర్వో స్పష్టం చేశారు. అటువంటి సౌకర్యాలు అందుబాటులో లేని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని సూపర్వైజర్లు, బిఎల్వోలు ఉన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయంగా పనిచేద్దాం - ఎంపిడిఓ

అల్లవరం, మేజర్ న్యూస్ : జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ అధ్యక్షతన మండలం లోని అన్ని శాఖల మహిళా ఉద్యోగినిలతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత ద్వారా దేశం అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరు కృషి చేయాలన్నారు. సరోజినీ నాయుడు జన్మదినాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అల్లవరం మండలం కులగణన, ఆరోగ్యశ్రీ కార్డ్ పంపిణీ, ఇతర అంశాలలో ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానం సాధించడంలో మహిళా ఉద్యోగినులు పాత్ర ఉందన్నారు. కేక్ కట్ చేసి, చిరుకానుకలు ఉద్యోగినులకు పంపిణీ చేశారు.పాల్గొన్న ఉద్యోగినులు తాము ఉద్యోగంలో జాయిన్ అయ్యాక ఇలా జాతీయ మహిళా దినోత్సవం మొదటసారి నిర్వహించారని ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కృష్ణమోహన్, ఆఫీస్ సిబ్బంది రమణమ్మ, సుబ్బలక్ష్మి, ఉద్యోగినులు అలేఖ్య, ప్రవల్లిక, కరుణామయి, మేఘన, లలితా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొవ్వూరు, మేజర్ న్యూస్ : కొవ్వూరు రోడ్ కం రైల్వే వంతెన పై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ జలాది శ్రీనేష్ కుమార్ (35)మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల అందించిన వివరాల ప్రకారం సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా శ్రీనేష్ కుమార్ కేరళ విమానా్ర శయంలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. నాలుగు రోజుల క్రితం తన సొంత గ్రామమైన చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి వచ్చాడని తెలిపారు. సోమవారం మోటార్ సైకిల్ పై ధవళేశ్వరం తమ బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మోటార్ సైకిల్ రోడ్ కం రైల్వే వంతెన పై అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టగా తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు శ్రీనేష్ కుమార్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కె.జగన్ మోహన్ రావు తెలిపారు.

ఫిబ్రవరి 16 జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

- రైతులకు గిట్టుబాటు మద్దతు ధర చట్టం చేయాలి
- నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి
- రైతు,వ్యవసాయ,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

కాకినాడ, మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వం బిజెపి రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలోగ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. ఈ పిలుపులో భాగంగా కాకినాడ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆల్ ఇండియా ట్రేడ్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేయడం జరుగుతుంది. ఈ ప్రచారంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొన్నారు. తాటిపాక మధు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్ల చట్టాన్ని తీసుకొచ్చిందని, ఆ చట్టాలను పార్లమెంట్లో ఆమోదించాలని ప్రయత్నం చేయగా సుమారు 500 పైన రైతు సంఘాలన్నీ కలిసి ఢిల్లీ నడిరోడ్డుపై సంవత్సరం పాటు సుదీర్ఘమైన పోరాటం చేశారని, ఆ పోరాటానికి మోడీ వెనక తగ్గడం జరిగిందని, రైతులను క్షమాపణ అడిగిన మోడీ ఆ జీవోలను పార్లమెంట్లో ప్రవేశపెట్టి రద్దు చేస్తానని చెబుతూనే ఆ తీర్మానాలు ప్రవేశపెడుతున్నారని, ఆ విధానాలను అమలు మానుకునేందుకు బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరల ఢిల్లీలో రైతుల ఆందోళనకు సిద్ధమయ్యారని, అందులో భాగంగా ఈనెల 16వ తేదీన రైతులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బందు, పారిశ్రామిక సమ్మెకు పిలుపునిచ్చారని, ఈ పిలుపును ఈ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు జరుపుతామని, దానికి ప్రజల స్వచ్ఛందంగా సహకరించాలని, రైతులకు గిట్టుబాటు మద్దతు ధర చట్టం తేవాలని, రైతుల రుణాలుమాఫీలు చేయాలని, స్వామినాథన్ సిఫార్సు కమిటీ నివేదిక అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించి కనీసం 600 రూపాయలు వేతనం కల్పించాలని మధు అన్నారు. కమిరెడ్డి బోడకొండ మాట్లాడుతూ ఫిబ్రవరి 16వ తేదీన జరిగే దేశవ్యాప్త భారత బందుకు, పారిశ్రామిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని, అటు పరిశ్రమంలోనే ఇటు గ్రామీణ ప్రాంతాల్లోనూ సిపిఐ పాల్గొంటుందని ఆయన అన్నారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బందుకు, పారిశ్రామిక సమ్మెకు ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల కార్మికులు స్వచ్ఛందంగా సహకరించి భాగస్వాములు అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు 1000 రూపాయలు కూలి ఉండాలని, కార్మిక చట్టాల అమలులో ఒక్కొక్క చట్టం వెనుక అనేక పోరాటాల చరిత్ర ఉన్నదని, అలాంటి కార్మిక చట్టాలు నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ని తీసుకొచ్చిందని, ఈ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేసి ప్రభుత్వంలోనే కొనసాగించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డులో వాడుకున్న కోట్లాది రూపాయలు నిధులు తిరిగి బోర్డుకు జమ చేయాలని ఆయన అన్నారు. కాకినాడ రూరల్ ప్రాంతాల్లో కొవ్వాడ, రేపూరు, టీచర్స్ కాలనీ, సర్పవరం ఇండస్ట్రియల్, రామయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలో విస్తృతంగా కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారణ చేస్తున్నామని ప్రసాద్ అన్నారు.

రాజకీయపార్టీలు సహకరించాలి

- ఈఆర్వో జె.వెంకటరావు

కాకినాడ, మేజర్ న్యూస్ : రానున్న ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాల యంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రగతిపై రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు-పరిష్కారాన్ని ఈఆర్వో వెంకటరావు రాజకీయపార్టీలకు వివరించారు. ఆయా పార్టీల నాయకులు వెలిబుచ్చిన సందేహాలను ఆయన నివృత్తిచేశారు. 80 ఏళ్ళుదాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు, అంధులు పోలింగ్‌బూత్‌కు వెళ్ళి ఓటు వేసేందుకు వీలుగా కల్పించిన ప్రత్యేక సదుపాయాలపై సభ్యులు చర్చించారు. అనంతరం ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్‌సీపీ), తుమ్మల రమేష్ (టిడిపి), అప్పారావు (బిఎస్‌పి), ఏఈఆర్వోలు హరిదాసు, దొర, నాగశాస్త్రులు, సీతాపతిరావు, జాన్‌బాబు, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్‌పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రివ్యూ

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రతి నెల జరిగే ఆశ నోడల్ ఆఫీసర్స్ మీటింగ్‌లో భాగంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.జె. నరశింహా నాయక్ అధ్యక్షతన అన్ని నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ గురించి రివ్యూ చెయ్యడం జరిగింది. ఈ సందర్భముగా జిల్లా ఇమ్యూనైజేషన్ డా. కె. రత్న కుమార్ మాట్లాడుతూ వచ్చే నెలలో 03.03.2024న జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి అందరి సహకారాన్ని కోరుతూ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది.ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. ఆర్. రమేష్, జిల్లా ఎయిడ్స్ మరియు టిబి అధికారి, డా.అరుణ, జిల్లా ఆర్సిహెచ్ & ఎంసిహెచ్ నోడల్ ఆఫీసర్, మాట్లాడుతూ వారి వారి ఆధ్వర్యములో జరుగుతున్న కార్యక్రములలో అందరు పాల్గొని మరింత బాధ్యతగా పని చేయ్యవలసిందిగా సూచించారు. ఆశ నోడల్ ఆఫీసర్స్ మాణికుమారి మరియుఇంచార్జ్ డి.పి.హెచ్.ఎస్.ఓ రత్నకుమారి మాట్లాడుతూ ఆశ యాప్ ను ఖచ్చితముగా అప్ డేట్ చేయ్యవలసిందిగా పని తీరుమరింత మెరుగు పరుచుకోవలసిందిగా సిబ్బందిని ఆదేశించడమైనది. ఈ కార్యక్రములో జిల్లాలోని అందరు పిహెచ్ఎస్ లు, హెచ్‌వి లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో కదం తొక్కిన శ్రీ వాగ్దేవి విద్యార్థులు

అమలాపురం, మేజర్ న్యూస్ : పవర్ కిక్ షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్థ

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన

సామర్లకోట, మేజర్ న్యూస్ : కాకినాడ కార్యదర్శి మరియు శిశు సంక్షేమ, సాధికారిక కార్యాలయం, మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం కాకినాడ వారి ఆదేశాల ప్రకారం స్థానిక సామర్లకోట మున్సిపాలిటీ యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు యు. సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం విద్యార్థినీ విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణ మరియు బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు అరికట్టడం గురించి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొటెక్షన్ ఆఫీసర్ జె. విజయ మాట్లాడుతూ విద్యార్థినులకు బాలల హక్కులు మరియు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత సేవ, మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సేఫ్టీ అన్ సేఫ్టీ మరియు బాల్యవివాహాలు నిర్మూలనపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ సిబ్బంది సూపర్వైజర్ సుల్తాన్ బీబీ, అంగన్వాడి వర్కర్స్ లక్ష్మి, నాగలక్ష్మి పాల్గొనడం జరిగింది.

డాబాపై నుండి జారిపోయిన వ్యక్తి వైద్యం పొందుతూ మృతి

– ఎస్సై రఘునాథరావు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : పెళ్లి నిమిత్తం వచ్చి డాబాపై ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి కాకినాడ జిజిహెచ్ లో వైద్యం పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఓకుర్తి గ్రామంలో జరిగింది. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట గ్రామానికి చెందిన బేలెం రమేష్ అనే వ్యక్తి వాతంగిలో జరుగుపెళ్లి నిమిత్తం స్నేహితులతో వచ్చి పెళ్లి అనంతరం నిద్రించడానికి డాబా పైకి వెళ్లే ప్రయత్నంలో కాలుజారి కింద పడడంతో తలకు బలమైన గాయమైందని వైద్యం నిమిత్తం మంగళవారం ఉదయం బంధువులు కాకినాడ జిజిహెచ్కు తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందినట్లు ఈ మేరకు మృతుని భార్య వంతు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జడ్డంగి ఎస్సై రఘునాథరావు తెలిపారు.

ఎపి జెఎసి ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ

కాకినాడ, మేజర్ న్యూస్ : రాష్ట్ర ఎపి జెఎసి పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఎపి ఎన్జీవో హోం కాకినాడ నందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెఎసి పక్షాన జిల్లా జెఎసి చైర్మన్ గుద్దటి రామమోహనరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగినది. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం పిలుపునిచ్చిన ఉద్యమ కార్యాచరణకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెఎసి మద్దతు తెలుపుతూ, ఈ నెల 14న తాలూకా, జిల్లాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన మరియు తాసిల్దార్ / ఆర్డీవో/ సబ్ కలెక్టర్ / కలెక్టర్లకు మెమోరాండం అందచేయుట, 15, 16వ తేదీలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేయుట, 17వ తేదీన తాలూకా స్థాయిలో ర్యాలీ మరియు ధర్నా చేయుట, 20వ తేదీన ఉమ్మడి జిల్లా కేంద్రాలలో ర్యాలీ మరియు ధర్నా చేయుట, 21వ తేదీ నుండి 24వ తేదీ వరకూ రాష్ట్ర నాయకులు జిల్లాలు తిరుగుతూ ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేయుట, 27వ తేదీన ఛలో విజయవాడని జయప్రదం చేయుట కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగులకు ఇంటిరియం రిలీఫ్ (ఐఆర్) 30% ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న +జుళీ, ~ూ+ూ×, ంబతీతీవఅఎవతీ శ్రీమ్ఘజవ జుఅఘ్ఘంష్ఠఎవత్ వేంటనే క్లియర్ చేయాలని, పెండింగ్ లో ఉన్న డిఎ (కరువు భత్యం) లు వెంటనే రిలీజ్ చేయాలని, ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న పిఆర్సి అరియల్స్ క్లియర్ చేయాలని, పెన్షన్ అడిషనల్ క్వాంటమ్ లో ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే తొలగించి, పూర్తి స్థాయిలో పెన్షన్ దారులకు చెల్లింపులు చేయాలని, ఉద్యోగులకు కార్డురహిత, పూర్తిస్థాయి వైద్య సౌకర్యము ఈహెచ్ఎస్ ద్వారా కల్పించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులర్ పక్రియ వెంటనే పూర్తి చేయాలని, అవుట్ సోర్సింగ్ లో పనిచేసే ఉద్యోగులకు రైస్ కార్డ్స్ మరియు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి ప్రతి నెల మొదటి రోజునే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటివరకు ఉద్యోగుల నుండి జమ కాబడిన మొత్తంతో బాటు ప్రభుత్వ వాటాను ఈనాటి వరకు వెంటనే ఎన్పిఎస్ అకౌంట్లలో జమ చేయాలని కోరడం జరిగిందని జెఎసి చైర్మన్ గుద్దటి రామమోహనరావు తెలియజేశారు.

ఈ సమావేశంకి జెఎసి కన్వీనర్ డి.వి. రాఘవులు, జిల్లా కార్యదర్శి పేపకయాల వెంకటకృష్ణ, ఉపాధ్యాయ సంఘలనుండి ఎస్టియు- బి.దొరబాబు, శ్రీనివాస్, జ్యోతిబసు, ఎపిటిఎఫ్- వెంకటరావు, టి.వెంకటరావు, వై.వెంకటరాజు, ఎస్ఎల్టిఎ- శరత్, ఎస్ఈఎంఎ- ఎస్.ఎ.వి.సత్యనారాయణ, ఎపిఎన్జీవో సహఅధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, అన్ని డిపార్టుమెంట్లు అధ్యక్షులు మరియు కార్యదర్శిలు పాల్గొనడం జరిగినది.

మామిడి, జీడి మామిడి పూత దశలోనే జాగ్రత్తలు పాటించాలి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో జీడిమామిడి, మామిడి తోటల్లో రైతులు అధిక దిగుబడులు సాధించుటకు పూత, పిందె దశలోనే జాగ్రత్తలు పాటించాలని పందిరిమామిడి ఉద్యాన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ సూచించారు. రంపచోడవరం మండలం తామరపల్లి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ఉద్యాన పరిశోధనా స్థానం (పందిరిమామిడి) వారు నిర్వహించిన సమావేశంలో శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ పలు సూచనలు చేశారు. అలాగే మరో శాస్త్రవేత్త డాక్టర్ వెంగయ్య మాట్లాడుతూ గిరిజన యువత ఉపాధి కోసం తాటికల్లు ద్వారా తాటి నీర, తాటి బెల్లం తయారీ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ మాట్లాడుతూ రైతులు పంట సమస్యలకు పరిష్కారాలు తెలుసుకోవడానికి పంచాయతీలో రైతు భరోసా కేంద్రం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతులకు వైఎస్సార్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పడం జరిగింది. జీడిమామిడి రైతులకు మందులు ఇచ్చి రైతు భరోసా కేంద్రానికి స్పెయిర్లు ఇస్తున్నారని, ప్రతీ రైతు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కమిటీ చైర్మన్ అబ్బులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషిగా ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటా

– పి.గన్నవరం నియోజవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు

అంబాజీపేట, మేజర్ న్యూస్ : ప్రజల మనిషిగా అన్నివేళలా మీకు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేసుకుంటానని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ చైర్మన్ పి.గన్నవరం వైఎస్ఆర్ సీపి ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు ఆసరా అందించారని, అన్ని వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుపరిచారని అన్నారు. మండలం పరిధిలోని 16 గ్రామాలలో 1,287 సంఘాలకు మందికిగాను రూ.9 కోట్ల 70 లక్షల 56 వేల 178లు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత ద్వారా లబ్ది చేకూరందని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలు, నాయకులు పాలాభిషేకం చేసారు. వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. మండలశాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, ఏఎంసి చైర్మన్ వేటూరి వెంకటరాజు, జెడ్పిటిసి బూడిద వరలక్ష్మి, ఏఎంసి వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ సూదాబత్తు లక్ష్మీ భార్గవి రాము, ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షులు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, నాగాబత్తుల సత్యానందరావు, ఎంఎం శెట్టి, ఎపిఎమ్ ఆర్ ఎం.డి. గాధర్, కొర్లపాటి కోటబాబు, ఉందుర్తి నాగబాబు, మైలా ఆనందరావు, గంటి శ్రీ రామమూర్తి, వాడపల్లి శ్రీనివాసరావు, కుడుపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్చ్ 9న జాతీయ లోక్ అదాలత్

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : మార్చ్9వ తేదిన సుప్రీం కోర్టు ఆదేశానుసారం పెద్దాపురం కోర్టు కాంపౌండు నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడునని, పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి తెలిపారు. దీనిలో భాగంగా పెద్దాపురం కోర్టు పరిధిలో గల పోలీస్ అధికారులకు, సమావేశం నిర్వహించి, ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని, కక్షిదారులు దీనిని ఉపయోగించుకుని వారి యొక్క కేసులు రాజీ చేసుకునేలా చూడాలని దీనికి పోలీస్‌వారు పూర్తి సహాయ సహకారం అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కుమారి దీప దైవకృప, జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్, బెంచ్ కోర్టు జడ్జి శేషాచార్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులు పండించే జాఫ్రాలు కొనుగోలుపై సమావేశం

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో జాఫ్రాలు గిరిజన రైతులు పండించిన వాటిని ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం వెలుగు, జిసిసి అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు, ఐటీడీఏ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారితో గిరిజన రైతులు పండించిన జాఫ్రాలు కొనుగోలుపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు పండించిన జాఫ్రాలు కొనుగోలు విషయంలో దళారులు దగ్గర గిరిజనులు మోసపోకుండా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతు ందని ఆయన తెలిపారు. వివిధ కంపెనీలు నుండి వచ్చిన ప్రతినిధులతో మాట్లాడుతూ జాఫ్రాలు ఒక మెట్రిక్ టన్ను రేటు ఎంతకు కొనుగోలు చేస్తున్నారు, అదేవిధంగా ఏ రకం కొనుగోలు చేస్తున్నారు తదితర వివరాలు ప్రాజెక్ట్ అధికారి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఐ టీ డి ఎ ద్వారా కొనుగోలు చేసిన జాఫ్రాలు వేలం లేదా ఇతర మార్గాలలో వివిధ కంపెనీలకు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ సి.హెచ్. శ్రీనివాసరావు, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, పిహెచ్ఓ చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచినీళ్లు వీధిలైట్లు సమస్య పరిష్కరించాలి

– సీపీఎం డిమాండ్

చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు మండలంలోని గొందిగుడెం గ్రామంలో వీధిలైట్లు వేసి మంచినీరు సరఫరా చేయాలని సీపీఎం నాయకులు యర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. పాలకులు, అధికారులు ప్రజాసమస్యలు మరిచారని, ఓడ దాటిన తర్వాత బోడి మల్లయ్య అన్నట్లు, గెలిచిన తర్వాత ప్రజల వైపు, గ్రామాల వైపు చూసే పరిస్థితి లేదని అన్నారు. నిధులు ఉండి లైట్లు వేయకుంటే సర్పంచులు లోపం, నిధులు ఇవ్వకపోతే ప్రభుత్వ లోపం, ప్రభుత్వం నుండి నిధులు రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నం ప్రజలకు గ్రామసభ పెట్టి వివరించాలని డిమాండ్ చేశారు. జమా లెక్కలు ప్రజలకు వివరించి పారదర్శకంగా ఉండాలని అన్నారు. సీపీఎం ప్రజాప్రతినిధులు ఉన్నచోట ప్రజలకు జవాబుదరీగా ఉన్నారని అన్నారు. సీపీఎం ప్రజాప్రతినిధుల వల్లే మండలంలో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం వైసీపీ పాలనలో ఎక్కడ వేసినగొంగళి అక్కడే ఉన్నదని అన్నారు. మౌలిక సదుపాయాలు పరిష్కరించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోడియం లక్ష్మణ్, దూభి లక్ష్మణ్, లేలి పాపారావు, ఆరెల రమేష్, బంధం రమేష్, ఆరెల సారయ్య పాల్గొన్నారు.

ISCCM ఆధ్వర్యంలో సెప్సిస్‌పై అవగాహన కార్యక్రమం

కాకినాడ, మేజర్ న్యూస్ : ఇండియన్ సొసైటీ ఫర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ISCCM) కాకినాడ అధ్యాయం సెప్సిస్ యొక్క క్లిష్టమైన సమస్యపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో సెప్సిస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నది. ఈ కార్యక్రమం ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5:00 నుండి 7:00 గంటల వరకు కాకినాడలోని ఐ.ఎం.ఎ. హాల్‌లో జరుగుతుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సెప్సిస్, సంక్రమణకు శరీరం యొక్క ప్రతిస్పందన ద్వారా ప్రేరేపించబడిన ప్రాణాంతక పరిస్థితి, తక్షణ శ్రద్ధ మరియు అవగాహన అవసరం అని, మా కమ్యూనిటీలో ఆరోగ్యం మరియు శ్రేయస్సును ప్రోత్సహించాలనే మా నిబద్ధతకు అనుగుణంగా, ×ాజజవీ కాకినాడ సెప్సిస్ మరియు దాని నివారణ గురించి అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలియజేశారు. సెప్సిస్ మరియు ప్రజారోగ్యంపై దాని ప్రభావం గురించి మరింత తెలుసుకోవడానికి అవకాశం కల్పిస్తూ, ప్రోగ్రామ్ సమయంలో సాయంత్రం 6:15 నుండి 6:45 వరకు బ్రీఫింగ్ సెషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ISCCM కాకినాడ చైర్మన్ డాక్టర్ ఎస్.వి. లక్ష్మీనారాయణ, కార్యదర్శి డాక్టర్ ఎస్.సిహెచ్.ఎస్. రామకృష్ణ, కోశాధికారి డాక్టర్ యు.కిషోర్ కుమార్ పాల్గొంటారన్నారు. ISCCM కాకినాడ గురించి తెలుపుతూ, ఇండియన్ సొసైటీ ఫర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ (ISCCM) కాకినాడ చాప్టర్ విద్య, పరిశోధన మరియు కమ్యూనిటీ ఔట్రీచ్ ద్వారా ఈ ప్రాంతంలో క్రిటికల్ కేర్ మెడిసిన్‌ను అభివృద్ధి చేయడానికి అంకితం చేయబడింది. మేము రోగి ఫలితాలను మెరుగుపరచడానికి మరియు క్రిటికల్ కేర్ ప్రాక్టీస్‌లో శ్రేష్ఠతను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తామన్నారు. అవగాహనను వ్యాప్తి చేయడానికి మరియు సెప్సిస్‌ను ఎదుర్కోవడానికి మా ప్రయత్నాలలో మాతో చేరండి అని కోరారు. మరింత సమాచారం కోసం డాక్టర్ రామకృష్ణను 9951512111/ 9885472314లో సంప్రదించండి అని తెలియజేశారు.

గోపాలపురంలో హోంమంత్రి టూర్ షెడ్యూల్ ఖరాలు

– ఈ నెల 15,16 తేదీల్లో గ్రామల్లో విస్తృత పర్యటన

గోపాలపురం, మేజర్ న్యూస్ : రాష్ట్ర హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తానేటి వనిత గోపాలపురం పర్యటన షెడ్యూల్ ఖరారయ్యింది. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పరిచయం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో హోంమంత్రి ఉన్నారు. నేపథ్యంలో ఆమె ఈ పర్యటన చేయాలని భావించారు. ఇటీవల గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన నేతలతో సమావేశమై ఓ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ మేరకు వైసీపీ గోపాలపురం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 15న తేదీన ఉదయం 9గంటలకు హుక్కుంపేట, 11 గంటలకు గోపవరం, సాయంత్రం 3గంటలకు రాజంపాలెం, 5 గంటలకు దొండపూడి గ్రామాల్లో మంత్రి పర్యటిస్తారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 9 గంటలకు కరగపాడు,11గంటలకు కొవ్వూరుపాడు, సాయంత్రం 3గంటలకు గుడ్డిగూడెం, 5గంటలకు సంజీవపురం గ్రామాల్లో పర్యటిస్తారని నాగరాజు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పలువురి నాయకులను, కార్యకర్తలను, ప్రజలను మంత్రి కలుసుకుంటారు. గోపాలపురం నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా నియమించిన తర్వాత మండలంలో తొలిసారి పర్యటిస్తున్నారు. ఈ రెండురోజుల్లో జరిగే హోంమంత్రి పర్యటనకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

తొర్రేడు జగనన్న హౌసింగ్ కాలనీలో రు. 3.5 కోట్ల రూపాయలతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

– రు. 56.70 లక్షలతో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభం
– సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట –మంత్రి వేణుగోపాల్

రాజమండ్రి రూరల్, మేజర్ న్యూస్ : నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవానికి సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేనని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖామంత్రి,రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాజమండ్రి రూరల్ మండలం తొర్రేడు గ్రామం జగనన్న హౌసింగ్ కాలనీలో రు.3.5 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, రు.56.70 లక్షలతో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంత్రి వేణుగోపాలకృష్ణ, అధికారులు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల మంది అర్హులైన అక్క చెల్లెమ్మల పేరున ఉచితంగా ఇంటి స్థల పట్టాలను అందించడమే కాకుండా వారికి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల్లో నేడు ఊళ్లను తలపించే విధంగా ఇల్లు నిర్మించడమే కాకుండా అంతర్గత రహదారులు, డ్రైనేజీ, త్రాగునీరు, ఎలక్ట్రిఫికేషన్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించి ఇచ్చిన హామీలను జగనన్న ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. నేడు జగనన్న కాలనీలో రు. 3.5 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్, కాలనీలో విద్యుత్ లైన్ నిర్మాణం వంటి పనులను శర వేగంగా పూర్తి చేసామన్నారు. అదేవిధంగా తొర్రేడు గ్రామ ప్రజలకు త్రాగునీటి కోసం రక్షిత మంచినీటి అందించేందుకుగాను జల జీవన్ పథకంలో భాగంగా గ్రామీణ నీటి సరఫరా సంస్థ ద్వారా రు. 56.70 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించుకొని, ప్రారంభించుకున్నా మన్నారు. తొర్రేడు గ్రామ ప్రజల త్రాగు నీటి అవసరాలు పరిష్కరించే విధంగా ఇంటింటికి కుళాయిలు, పైపు లైన్ల తో కనెక్షన్ల ను అందించామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తాగునీటి కుళాయిని ప్రారంభించి మహిళలకు బిందెలతో నీటిని అందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ... టీవీఎస్ ఎన్ మూర్తి, ఏఈ నారాయణరెడ్డి,ఎంపీడీవో డి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వైయస్సార్సీపి మండల పార్టీ అధ్యక్షులు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ చిట్టూరి వెంకట్రావు, స్థానిక నాయకులు దండమూరి అర్జునరావు, అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

13వ డివిజన్‌లో జనసేన 'మేము సిద్ధం'

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో స్థానిక 13 వ డివిజన్ సాంబమూర్తి నగర్, జ్యోతుల కాలనీ సమీపంలో పాలిక శివ ఆధ్వర్యంలో మంగళవారం మన ఊరు మన కాకినాడ లోనే ఉపాధి కోసం యుద్ధానికి మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ సహజసిద్ధంగా ఏర్పడిన పోర్ట్ కాకినాడకు తలమానికమనీ తరతరాలుగా ఈ పోర్ట్ సాంబమూర్తినగర్‌కి సమీపంలో ఉన్నా నేడు స్థానిక యువతకి ఉపాధి లేక కునారిల్లుతున్నారనీ, కాకినాడ యువతకి కాకినాడలో ఉపాధి పొందడం జన్మతహా వారి హక్కు అనీ, వై.సి.పి వారు ఇక్కడి భూములు కబ్జాలకీ, పనులు లాక్కోడానికీ, కాంట్రాక్టులు తెచ్చుకోడానికి సిద్ధం తప్ప యువతకి ఉపాధి కల్పించడానికి కాదనీ, ఇలాంటి పాలన చేస్తున్న ఈ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పేందుకు మేము సిద్ధం అని నినాదాలు చేసారు. జనసేన పార్టీ స్థానిక యువతకి స్థానికంగా ఉపాధి పొందేలా చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాకినాడలో పరిశ్రమలను వృద్ధిచేసి, డీప్ వాటర్ పోర్ట్ అభివృద్ధిచేసి పోర్టులో కార్యకలాపాలు పెంచి ఉపాధి కల్పించేలా బాధ్యత జనసేనపార్టీ తీసుకుంటాదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సిటీ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ, సిటీ జనరల్ సెక్రెటరీ రమణారెడ్డి, పాలిక శివ, సలీం, చొల్లంగి శ్రీను, దవులూరి శ్రీను, కొమ్మన సురేష్, పాలిక వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లు ఆపాలంటూ లబ్ధిదారులు రాస్తారోకో

– పట్టాలతో రోడ్డెక్కిన మహిళలు
– తహసీల్దార్ వచ్చి సమాధానం చెప్పాలంటూ డిమాండు

సామర్లకోట, మేజర్ న్యూస్ : సరైన ఇళ్ల స్థలాలు చూపించేంత వరకూ రిజిస్ట్రేషన్‌లు ఆపాలని డిమాండ్ చేస్తూ వికె.రాయపురం హౌసింగ్ లబ్ధిదారులు కాకినాడ ప్రధాన రహదారిపై రాస్తోరోకో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని సెంటర్‌లో గ్రామానికి చెందిన జగనన్న అందరికీ ఇళ్ళు పథకం ద్వారా పట్టాలు పొందిన మహిళలు వారి పట్టాలు చేత పట్టుకుని రోడ్డెక్కారు. నివాసానికి యోగ్యంగా లేని చోట అందించిన పట్టాలను రాద్దుపరచి యోగ్యమైన ప్రదేశంలో తమకు పట్టాలు ఇచ్చి స్థలాలు అప్పగించాలన్నారు. ఆ తరువాత మాత్రమే రిజిస్ట్రేషన్ లు చెయ్యాలని డిమాండ్ చేశారు.

మండలంలో అన్ని గ్రామాల్లో మంచి స్థలాలు అందించి తమకు మాత్రం నిరూపయోగమైన స్థలాలను అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే తహసీల్దార్ వచ్చి తమకు సమాధానం చెప్పాలని లబ్ది దారులు పట్టుబట్టారు. వీరి నిరసన కు గ్రామ నాయకులు కుర్రా రాజు, గొల్లపల్లి సర్వేశ్వర రావు, రజిని లు మద్దతునిస్తూ పాల్గొన్నారు.

–స్తంభించిన ట్రాఫిక్ :

కాకినాడ రోడ్డులో బైఠాయించి మహిళలు ఆందోళన చేపట్టడంతో కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ కు గంటల కొద్దీ అంతరాయం కలిగింది. వాహనాలు రాకపోకలు జరిపేందుకు వీలు లేక పోవడంతో ప్రజలు, ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. నిరసన స్థలానికి పోలీసులు చేరుకోగా వారికి లబ్ధిదారులు వారి డిమాండ్లకు సంభందించి వినతి పత్రాన్ని అందించి వాటిని పరిష్కరించాలని కోరారు. దానితో పోలీసులు ఏమీ చెయ్యలేని పరిస్థితిల్లో నిరసన కారుల పట్ల సామరస్యంగా వ్యవహరించారు.

వేమనకు ఘననివాళి

దేవరపల్లి, మేజర్ న్యూస్ : పల్లంట్లలో యోగి వేమన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కూచిపూడి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వేమన విగ్రహానికి మండలం మానవత చైర్మన్ బలుసు సత్యనారాయణ పూలమాలలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా కవి, సంఘసంస్కర్త యోగి వేమన పద్యం వినని తెలుగువారు ఉండరని విశ్వదాభి రామ వినుర హేమ పద్యం తెలియని తెలుగువారు ఉండరని అన్నారు. ఈ సందర్భంగా మానవత కో. చైర్మన్ పప్పు వెంకట రామారావు వేమన పద్యాలు పాడి ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా వేమన ఆదర్శంగా తీసుకుని వివాహాలు చేసుకున్న ఉండవల్లి కృష్ణారావు ,ప్రభావతి దంపతులను మరియు కొత్తగుండి రత్నాజీ దంపతులను సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ మంత్రాలు ,తంత్రాలు లేకుండా రెండు కాగితాలు రాసుకుని దండలు మార్చుకుని వివాహం చేసుకున్నామని తెలిపారు. అనంతరం వేమన సంఘం అధ్యక్షుడు కూచిపూడి సత్యనారాయణను సన్మానించారు .ఈ కార్యక్రమంలో మండల మానవత ఉపాధ్యక్షులు ఆచంట సుభాష్ చంద్రబోస్, అడ్వకేట్ కే.వీ.వి. సత్యనారాయణ, నల్లమాటి రామారావు, జలజాక్షి, కూచిపూడి హనుమంతరావు, మహిళా మండల సభ్యులు, పాల్గొన్నారు.

గోరింటలో పోస్టల్ పథకాలపై అవగాహన

పెద్దాపురం, మేజర్ న్యూస్ : సామర్లకోట సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనిల్ అంబేద్కర్ ఆదేశాల మేరకు పెద్దాపురం మండలం, గోరింట గ్రామంలో మంగళవారం పోస్టల్ పొదుపు పథకాలపై ఇంటింటికి వెళ్ళి ఆర్.డి., ఎస్.బి, ఆర్.పి.ఎల్.ఐ, పి.ఎల్.ఐ, పి.పి.ఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, ఇతర ఐపిబివి అకౌంట్ల ఓపెనింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేల్ ఓవర్‌సీల్ త్రిమూర్తులు, పిఎం రామలక్ష్మి, రవి, ఈశ్వరరావు, రాజేష్, గంగాధర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వం సమ్మెలో ఇచ్చిన హామీల జీవోలను తక్షణమే విడుదల చేయాలి

- జీవోలు అమలు చేయకుంటే ఎన్నికల ముందు సమ్మెబాట పడతాం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్

కాకినాడ, మేజర్ న్యూస్ : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12, 13 తేదీలలో మున్సిపల్ కార్పొరేషన్, నగరపాలక, పురపాలక పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య ఆప్కాస్ కార్మికులు నల్ల బ్యాడ్జి ధరించి నిరసనలు తెలియజేయాలని రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ జిల్లా, కాకినాడలో మంగళవారం సర్కిల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షతన నిరసనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు సమ్మె ఒప్పందంలో భాగంగా ఇచ్చిన హామీలు లకు జీవోలు తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే ఎన్నికల ముందు మరల సమ్మెబాట పడతామని ప్రసాద్ హెచ్చరించారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని, వారం రోజులపాటు సమ్మె చేయడం జరిగిందని, సమ్మెలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒప్పంద భాగంగా ఇప్పటివరకు జీవోలను విడుదల చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె వేతనాలు అమలు చేస్తామని చెబుతూనే పనులు చేయాలని ఆదేశాలిచ్చి కార్మికులపై మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని, సంక్రాంతికి కానుకగా ఇస్తానన్న వెయ్యి రూపాయలు మంజూరు చేయలేదని, 15 వేల జీతం హెల్త్ అలవెన్స్ 6,000 రూపాయలు కలిపి మంజూరు చేస్తామని చెప్పి ఇంకా అమలు చేయకపోవడం దౌర్భాగ్యం అని, సామర్లకోటలో డ్రైవర్లను నియమించకుండా ఎన్.ఎం.ఆర్. కూలీలతో డ్రైవర్లు పనులు చేయించుకుంటూ వారిపై అదనపు పనిభారం మోపుతున్నారని, డ్రైవర్లకు డ్రైవర్ స్థానంలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తానన్న ప్రభుత్వం అందులో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కాలనీ ఏర్పాటుకు స్థల సేకరణ చేసి ఫ్లాట్స్ నిర్మించాలని, ప్రభుత్వం మంజూరు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు వారికి వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బూటకపు కబుర్లు నమ్మి ఇప్పటికే మోసపోయామని, ఇక సహించేదే లేదని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీలు జీవో ప్రకారంగా విడుదల చేయాలని, లేకుంటే మరల ఆందోళనకు సిద్ధం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తుపాకుల లక్ష్మీనారాయణ, మీసాల మణికంఠ, వాసుపల్లి ప్రసాద్, తుపాకుల వీర్రాజు, కస్తూరి శివ, బండి అప్పన్న, సింగంపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేట్లపాలెంలో ఆసరా 4వ విడత రూ. 12.30 కోట్లు ఆసరా పంపిణీ..

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఆసరా 4వ విడత కార్యక్రమం ద్వారా రూ. 12.30 కోట్ల లబ్దిని మహిళా సంఘాలకు పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు అందజేశారు. గ్రామంలో మంగళవారం ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ అందించిన ఫలాలను వివరించారు. మాట తప్పని నాయకునిగా జగన్ ఉన్నందున రానున్న ఎన్నికల్లోఆరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించాలని, నియోజక వర్గంలో తనను ఎమ్మెల్యే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఆధ్యక్షులు తాటికొండ అచ్చిరాజు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ , నాయకులు వల్లూరి పెద్ద , ఎలిశెట్టి నరేష్, తలారి దొరబాబు, ఎఎబి చైర్మన్ నిడదవోలు సురేష్, ఉపసర్పంచి, ఎంపీటీసీ, నాయకులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కడియం మండలంలో మంత్రి వేణుగోపాలకృష్ణ సుడిగాలి పర్యటన



కడియం, మేజర్ న్యూస్ : కడియం మండలంలో మంత్రి వేణుగోపాలకృష్ణ సుడిగాలి పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. జేగురుపాడు జగనన్న కాలనీలో విద్యుద్దీకరణ కొరకు రు. 3.58 కోట్ల రూపాయలతో 33/11 కె.వి సబ్ స్టేషన్, కాలనీలో విద్యుత్ లైన్లో నిర్మాణం ప్రారంభోత్సవం జరిగింది. కడియం సుబ్బారావు పేటలో 12 లక్షల రూపాయలతో నిర్మించిన అంగన్వాడి కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. కడియంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ మల్టీపర్పస్ పనులు ప్రారంభోత్సవం జరిగింది. ఎస్సీ పేటలో నిర్మించిన వాలీబాల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీ గోడ, అరుంధతి పేట రామాలయం వెనుక జగజ్జీవన్ రామ్ మల్టీపర్పస్ సెంటర్ పనులు ప్రారంభం ఆనంతరం రైతు బజార్ ప్రారంభం జరిగింది. నాయి బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు సేకరించిన స్థలం అందజేశారు. కడియం ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన , అక్కడ చికిత్స పొందుతున్న వారిని మంత్రి వేణు పరామర్శించారు. కడియం హైస్కూల్లో నిర్మించిన వాకింగ్ ట్రాక్ ప్రారంభోత్సవం జరిగింది. అనంతరం క్రీడాభివృద్ధి సంస్థ నిధులతో చేపట్టిన ఓపెన్ జిమ్ క్రికెట్ ప్రాక్టీస్ నెట్ వాలీబాల్ కోర్టు పనులకు శంకుస్థాపన జరిగింది.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు కోతులు బెడద తగ్గినట్టే

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో గత ఐదేళ్ల నుండి కోతులు బెడద ఎక్కువయింది. గ్రామం నలుమూలల ఆలయాలు, గురుకుల పాఠశాల, పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో కోతులు రాజ్యమేలు తున్నాయి. వృద్ధులు, చిన్నారులు, మహిళలు, విద్యార్థులు దినచర్యలు చేసుకోవాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సిందే. ఇటీవల కాలంలో కోతులు మనుషులు పై దాడులు చేయడం గణనీయంగా పెరిగింది. దుకాణాలు, ఇళ్లలో కోతులు చొరబడిఆహార పదార్థాలు, తినుబండారాలు ఎత్తుకుపోవడం మనుషులపై దాడులు చేయడం జరుగుతుంది. అలానే పెంకుటిల్లు లో పెంకులు తీసి కోతులు చొరబడడం జరుగుతుంది. పెంపుడు కోళ్లు పై దాడి చేయడం, గ్రామంలో కోతులు బారి నుండి రక్షించాలని పత్రికల్లో వార్తలు రాయడం సర్వసాధారణం. ఎట్టకేలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి చొరవతో కోరుకొండ గ్రామం నుండి కోతులు పట్టే బ్యాచ్ ని రప్పించి గత నాలుగు రోజులుగా గ్రామంలో నాలుగు చోట్ల బోన్ లు ఏర్పర్చి సుమారు 300 కోతులును సురక్షితంగా పట్టుకోవడం జరిగింది. వీటిని సుదూరంగా పెదవలస ఘాటి సమీపంలో సోమవారం రాత్రి వదిలిపెట్టడం జరిగిందని టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు తెలిపారు. మిగిలిన కోతులను సురక్షితంగా పట్టుకోవడం జరుగుతుందని సర్పంచ్ రమణి స్థానిక విలేకరులకు తెలిపారు. గత ఐదేళ్ల క్రితం స్థానిక విగ్నేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో కోతులు ఎక్కువగా ఉన్న చోటబోన్ లను ఏర్పాటు చేసి కోతులను పట్టుకొని అడవుల్లో వదిలేయడంతో సుమారు రెండు ఏళ్లపాటు గ్రామానికి కోతుల బెడద లేకుండా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఉభయ గోదావరి జిల్లా కాంగ్రెస్ సమావేశానికి పిలుపు నిచ్చిన అరిగెల అరుణ కుమారి

పెరవలి, మేజర్ న్యూస్ : ఉభయగోదావరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశం ఫిబ్రవరి 14వ తేదీ బుధ వారం ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరం పేపర్ మిల్ గేటు వద్ద ఉన్న శ్రీ సాయి కళ్యాణ మండపంలో నిర్వహించబడునని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యుల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మాణిక్యంఠాగూర్ కొప్పుల రాజు ఏఐసీసీ సెక్రెటరీ మయ్యప్పన్ సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్రరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వహక అధ్యక్షురాలు ఉభయగోదావరి జిల్లాల పర్యవేక్షకులు సుంకర పద్మశ్రీలు విచ్చేయు చున్నారు. కావున జిల్లాలో ఉన్న నగర, పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్సులు, యూత్, కాంగ్రెస్ ఎన్ ఎస్ . యు.ఐ మహిళా విభాగం ఎస్సీ విభాగం, కిసాన్ విభాగం, అసంఘటిత కార్మికుల విభాగం, వివిధ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్స్ విధిగా హాజరు కావలసిందిగా ఆమె పిలుపునిచ్చారు.

స్థలాలు చూపించకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని పట్టాల రిజిస్ట్రేషన్ అడ్డగింత

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట మండలం వెంకటకృష్ణ రాయపురం గ్రామంలో అందరికీ ఇళ్ళు పథకంలో చేపడుతున్న పట్టాలకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని లబ్ధిదారులు అడ్డుకున్నారు. తమకు అప్పగించని స్థలాలకు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారాని లబ్ధిదారులు వారి పట్టాలను చూపించి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన మహిళలు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 350 ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే తమకు ఇప్పటి వరకూ స్థలాలు అప్పగించలేదన్నారు.ఈ పట్టాలు రిజిస్ట్రేషన్ కొరకు సచివాలయానికి సచివాలయం సిబ్బంది రమ్మని చెబితే వచ్చామన్నారు. అయితే రిజిస్ట్రేషన్ చేసేముందు మాకు స్థలాలు చూపించి చెయ్యాలని వారు అధికారులను నిలదీసారు.అప్పటి వరకూ రిజిస్ట్రేషన్ లు ఆపాలని వారు డిమాండ్ చేశారు. దానికి గ్రామ వీఆర్వో వివరణ ఇస్తూ తాము ఇప్పటికే ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టిలో పెట్టడం జరిగిందన్నారు. అయితే వారు వచ్చి సమస్య పరిష్కరించేంత వరకూ మాకు ఎవరికీ రిజిస్ట్రేషన్ చెయ్యవద్దని లబ్ధిదారులు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో మంజూరు అయిన రోడ్లు నత్తనడకన సాగుతున్న వైనం

- పట్టించుకోని అధికారులు - మెటల్ రోడ్డుపై రాయి పిక్కలు తేలి ఇబ్బందులు పడుతున్న ఆదివాసీయులు

దేవిపట్నం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల రోడ్డు లేని గిరిజన గ్రామాలకు కొత్త రోడ్లు మంజూరు చేయాలని, అలాగే మంజూరైన రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర నాయకులు తెల్లం శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, మండల కేంద్రంలోని ముసిని గుంట గ్రామం నుండి రంపచోడవరం మండలంలోని నర్సాపురం గ్రామం వరకు మంజూరైన తారు రోడ్డు పనులు నత్త నడకన సాగుతున్నాయన్నారు.త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు దుమ్ము దూళీతో పాటు, రోడ్డు మీద మెటల్ రాళ్లు రోలర్ చదును చేయకపోవడంతో ఆ రాళ్లు తేలి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ద్విచక్ర వాహనాల వారు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అదేవిధంగా కొత్త రోడ్లు అర్.అండ్.ఆర్.కాలనీ నాగులాపల్లి గ్రామం నుండి దేవారం గ్రామం, అక్కడి నుండి చిన్నారి గండి గ్రామం, పోతవరం గ్రామం, పోతుకొండ గ్రామం వరకు తారు రోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయాలని రాష్ట్ర నాయకులు తెల్లం శేఖర్ స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, బిస్కెట్లు పంపిణి

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ ఇండస్ట్రీయలిస్ట్ మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దాపురం పట్టణంలో మంగళవారం మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.25వేలు విలువ చేసే స్టీల్ ప్లేట్‌లను, బిస్కెట్ ప్యాకెట్‌లను ఆయన చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకాలం నుండి ప్రతీ విద్యార్థి ఇంటి వద్దనుండి ఎవరి ప్లేటు వారు తీసుకురావడం గమనించి, రాజేష్ కుమార్ ఆ లోటు తీర్చాలనే సదుద్దేశంతో ఈ ప్లేట్లు పంపిణి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే రాబోయే రోజులలో మరిన్ని పాఠశాలలకు దాతల సహాయంతో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, గత మూడు సంవత్సరాలలో రోజుకు ఒకటి చొప్పున ఇప్పటికి వెయ్యికిపైగా అన్నదానాలు మరియు సేవా కార్యక్రమాలు చేసుకుంటూ వస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ కొమ్మోజు లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా మంగళవారం వివేకానంద మున్సిపల్ యు.పి. పాఠశాల, పాతపెద్దాపురం, సాగర్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాల దర్గాపేట, కొత్తపేట మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలోని విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు ఎడ్ల శ్రీనివాస్, సురాడి సత్యవేణి, అనుపొజు దుర్గారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవత రాజేష్ కుమార్ సేవలనును పట్టణంలోని పలువురు ప్రముఖులు అభినందించినవారిలో ఉన్నారు.

జనవిజ్ఞాన వేదిక, పోలీస్ వారి ఆధ్వర్యంలో కాండ్రకోటలో మూఢనమ్మకాలపై అవగాహన

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో గత కొద్ది రోజులుగా వింత ఆకారం గల జంతువు తిరుగుతుందని వదంతులు వ్యాప్తి చెందుతున్న కారణంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞావేదిక, పెద్దాపురం సిఐ వై.రవికుమార్, ఎస్సై వెలుగుల సురేష్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞావేదిక సైన్ & టెక్నాలజి కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, దయ్యం పట్టుకుంటామనే వారు చేసే వివిధ ట్రిక్‌ల వెనుక గల రహస్యాన్ని మ్యాజిక్ ద్వారా వివరించారు. జెవివి జిల్లా అధ్యక్షులు కె.ఎంఎం.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ 150 సం.ల క్రితమే వీరేశలింగం దయ్యాలు లేవని, శ్మశానంలో నిద్రించి నిరూపించారని, అయినా దయ్యాలున్నాయని నమ్మడం హాస్యాస్పదమని ఆయన తెలిపారు. కాకినాడకు చెందిన ప్రముఖ సైక్రియాటిస్ట్ డా.కాటన్ మనుషులలో భయాలు ఎలా కలుగుతాయో, అవి ఎలా ప్రజలలో వ్యాప్తి చెందుతాయో వాటిని ఎలా మనం ఎలా ఎదుర్కొవాలో ఉదాహరణలతో అవగాహన కల్పించారు. యుటిఎఫ్ నాయకులు ప్రభాకరవర్మ తెలుపుతూ కొన్ని నమ్మకాలు సామాజికంగా నష్టం కలిగిస్తున్నపుడు ప్రజలందరూ వాటిని చైతన్యపూరితంగా, సామాజికంగా ఎదుర్కొవాలని తెలిపారు. సిఐ రవికుమార్ తెలుపుతూ స్మార్ట్ ఫోన్‌తో ఎక్కువ సేపు గడపవద్దని, ఏ ఫోన్‌తో వదంతులు వ్యాప్తి చేశారో, అదే ఫోనుతో ఈ అవగాహన అంశాలను కూడా ప్రచారంలో పెట్టాలని గ్రామస్దులకు సూచించారు. ఎస్సై వెలుగుల సురేష్ ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు కె.ఎం.ఆర్.ప్రసాద్, శ్రీ రామారావు, బాలాజి, ఉమ మంగతాయారు, సూర్యనారాయణ, డివివి సత్యనారాయణ, పద్మావతి, ఈశ్వరరావు, భాష, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట

- రు. 3.5 కోట్ల రూపాయలతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్
- రు. 56.70 లక్షలతో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించిన మంత్రి వేణుగోపాల్

రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవానికి సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేనని జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖామంత్రి,రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాజమండ్రి రూరల్ మండలం తొర్రేడు గ్రామం జగనన్న హౌసింగ్ కాలనీలో రు.3.5 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, రు.56.70 లక్షలతో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ ను మంత్రి వేణుగోపాలకృష్ణ , అధికారులు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల మంది అర్హులైన అక్క చెల్లెమ్మల పేరున ఉచితంగా ఇంటి స్థల పట్టాలను అందించడమే కాకుండా వారికి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.జగనన్న కాలనీల్లో నేడు ఊళ్లను తలపించే విధంగా ఇల్లు నిర్మించడమే కాకుండా అంతర్గత రహదారులు, డ్రైనేజీ, త్రాగునీరు, ఎలక్ట్రిఫికేషన్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించి ఇచ్చిన హామీలను జగనన్న ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. నేడు జగనన్న కాలనీలో రు. 3.5 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్, కాలనీలో విద్యుత్ లైన్ నిర్మాణం వంటి పనులను శర వేగంగా పూర్తి చేసామన్నారు. అదేవిధంగా తొర్రేడు గ్రామ ప్రజలకు త్రాగునీటి కోసం రక్షిత మంచినీటి అందించేందుకుగాను జల జీవన్ పథకంలో భాగంగా గ్రామీణ నీటి సరఫరా సంస్థ ద్వారా రు. 56.70 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించుకొని, ప్రారంభించుకున్నా మన్నారు. తొర్రేడు గ్రామ ప్రజల త్రాగు నీటి అవసరాలు పరిష్కరించే విధంగా ఇంటింటికి కుళాయిలు, పైపు లైన్లతో కనెక్షన్లను అందించామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తాగునీటి కుళాయిని ప్రారంభించి మహిళ లకు బిందెలతో నీటిని అందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ... టీవీఎస్ ఎన్ మూర్తి, ఏఈ నారాయణరెడ్డి,ఎంపీడీవో డి శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వైయస్సార్సీపి మండల పార్టీ అధ్యక్షులు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ చిట్టూరి వెంకట్రావు, స్థానిక నాయకులు దండమూరి అర్జునరావు, అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

"రోడ్డు ప్రమాదాల నివారణ" పై న్యాయ విజ్ఞాన సదస్సు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మరియు తూర్పు గోదావరి జిల్లా రోడ్డు రవాణా అధికారుల సమన్వయ అధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం నందు "డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు జారీకి సంబంధించిన సమస్యల పరిష్కారం" మరియు "రోడ్డు ప్రమాదాల నివారణ" పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి. కె. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు జారీ విషయంలో సంబంధిత అధికారులు పాటించవలసిన నిబంధనల గురించి వివరించారు. "మోటారు వాహనాల చట్టం, 1988" మరియు మోటారు వాహనాల సవరణ చట్టం, 2019" లోని వివిధ అంశాల పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన అవసరమని, పరిమిత వేగంతో, భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని అన్నారు. మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు తీసుకుని వాహనాలను నడపడం చాలా ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు ఉన్నాయని తెలిపారు. వాహనాలు నడిపే వారు చాలా భాద్యతగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణనష్టం జరిగినా, తీవ్రమైన గాయాలు సంభవించినా చాలా జీవితాలు, కుటుంబాలు ప్రభావితమవు తాయని అన్నారు. మోటారు వాహనాల ఇన్స్పెక్టర్ సి. హెచ్. సంపత్ కుమార్ వివిధ ట్రాఫిక్ చిహ్నాల గురించి వివరించడంతో పాటు రోడ్డు ప్రమాదల బాధితులకు తక్షణ సహాయం అందించాలని, అలా సహాయపడిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ సదస్సులో అసిస్టెంట్ లీగల్